# ఫలితం ★

రచన: యం. యస్. చెలం

మరణశయ్యమీదవున్న మహాలక్ష్మమ్మ తమ్ముడు రాధాకృష్ణయ్యను దగ్గరగా పిలచి "మాధవుణ్ణి నీ కప్పగించిపోతున్నాను. తల్లీదండ్రీలేని, వాడికి మీరే తల్లితండ్రులు: వాడికి నీ కూతురునిచ్చి ఒకయింటివాణ్ణి చెయ్యవలసినభారం నీదే-నేను వాణ్ణి ధనసంపత్తితో నీకు యివ్వలేకపోయినా విద్యావంతునిగా నీచేత పెడుతున్నాను" అనేసి తనకర్తవ్యం నెరవేర్చుకున్న తృప్తితో 'హరీ' అనేసింది.

రాధాకృష్ణయ్య అక్కగారి కోర్కను మన్నించటానికే నిశ్చయించుకున్నాడు. అయితే యీవిషయంలో అతనికి భార్య సాధింపు తప్పలేదు.

దమ్మిడీ ఆస్తిలేని దౌర్భాగ్యుడికి తన కూతుర్ని పెళ్లాడే అర్హతలేదంది. ఒక్క పిల్లను చూస్తూ చూస్తూ పేదవాడికి ముడివేయటం తల్లినైన నేను ససేమిరా ఒప్పుకోనంది. అలా జరిగిననాడు తాను ఏనుయ్యో గొయ్యో చూసుకుంటానని బెదిరించింది.

ఆవిడకు మొదటినుండీ కూతుర్ని తన అన్న కొడుక్కి యివ్వాలనే అభిలాషవున్నదని రాధాకృష్ణయ్యకు తెలుసు. భార్య అనుంగీకారానికి అతని మనస్సుకూడా వెనకాడింది.

అయితే - ఆసమయాన అక్కగారి కోర్కె జ్ఞప్తికిరావటం, పైగా తనను వ్యక్తిత్వంగల వ్యక్తిగా భావించి గౌరవించే మిత్రబృందం సలహాను పాటించి, భార్యమాటను కొట్టివేసి చచ్చి స్వర్గానవున్న అక్కకు మనశ్శాంతి కలిగేలా కూతుర్ని మాధవుడికే యిచ్చి పెళ్ళి చేశాడు.

పెళ్ళయ్యాక మాధవుడు అత్తవారింట్లోనే మకాం పెట్టాడు. పాపం అతనికి అత్తవారింట అల్లునికి జరగవలసిన మర్యాద జరగటంలేదు సరిగదా, కొద్దిరోజుల్లోనే ఆయింట్లో పనిచేస్తూ తొలగింపబడిన పాలికాపు కుఱ్ఱవానిచేత "నా నోటికూడు తీయటానికి నువ్విక్కడ దాపురించావయ్యా!" అని ముఖమెదుటే అనిపించుకోవలసివచ్చింది.

ఇంట్లోకి కావలసిన నీరు చేరవేయటం, చెట్లపాదులకు నీరుపోయటం కావలసిన బజారు సరుకులు మోసుకురావటం...యిత్యాది గృహకార్యాలన్నీ అతని దైనందిన కార్యక్రమాలుగా పరిగణింపబడ్డాయి.

అతడలా చేస్తున్నా మధ్యమధ్య అత్తగారి ఆటపోటుమాటలు తప్పటం లేదు. ఆవిడ తన కూతురి సమక్షానే అల్లుడి అవివేకాన్ని ఏకరువు పెడుతూండేది. "యిలాంటి పుచ్చువంకాయలు కళ్ళువున్న ఎవరైనా తెచ్చుకుంటారూ? వీటి మొఖానికి వీ శెముప్పావులా ధరేమిటి? నిన్న యింటికివచ్చి నవనవలాడుతూన్న తోటకాయలు అర్ధరూపాయి. వస్తానంటే అక్కర్లేదు పొమ్మన్నాను. ఇతగాడేదో సాధించుకొస్తాడని! రామ-రామ ఆరామిగాడే నయం! ఎంచక్కా బేరమాడిపసందైన కాయలు పట్టుకొచ్చేవాడు."

యీవిధంగా ఆవిడ ప్రతివిషయంలోనూ, అల్లుడితప్పుల్ని రామిగాడి ఒప్పులతో పోటీ పెట్టి, ఆపదేళ్ళకూతురు ముందు ఏకరువుపెడ్తూ, ఆపిల్లలోకూడా భర్తంటే రామిగాడిలాంటి వాడనే అపోహను పునాదివేసింది.

నిజానికి మాధవుడు అత్తగారు నిందించేంత అమాయకుడు కానేకాదు. అతడు ప్రతివిషయం లోనూ చాల జాగ్రత్తగానేవుంటాడు. అయినా అతనిలాంటి అవమానానికి గురికావటంలో విశేషమేమిటో అతనికి అర్థంకాలేదు. కాని విధివశంచేత తానిక్కడికి యీడ్వబడ్డాననే నమ్మకంమాత్రం అతనికి కలిగింది.

నాలుగేళ్ళతరువాత మాధవుడికి ప్రభుత్వ కొలువులో నెలకు వందరూపాయిలు సంపాదించే భృత్యత్వం సిద్ధించటంతో పునస్సంధానం కావించుకుని సతీసమేతంగా "భద్రపురం"లో కాపురం పెట్టవలసివచ్చింది. అల్లు

నికి లభించిన ఉద్యోగానికి అత్తగారికి ఆనందమైతే కలిగిందిగాని – ఆ సంతోషం బయటికి పొక్కనీయలేదు. కూతుర్ని బండిమీద ఎక్కించి “దాని కింకా చిన్నతనం ఎలా చూస్తావో ఏమిటో” అని అల్లుణ్ణి హెచ్చరించి మరీపంపింది.

మాధవుడు భద్రపురంలో కాపురం పెట్టాక కూడా భార్య అతని విలువను గుర్తించలేక పోయింది. ఆపిల్లలో తల్లివల్ల నాటుకుపోయిన చులకనభావాలు ప్రతివిషయంలోనూ ప్రత్యక్షమౌతూ నేవున్నై.

అతను ఆఫీసునుంచి అలసి యింటికి వచ్చినప్పుడు ఆవిడ పతివ్రతలా భర్తకోటును బూట్లను విప్పి, పాదప్రక్షాళనచేసి ఆజలం శిరస్సున జల్లుకోకపోతేమానె – మంచినీరైనా అందించవలసి వుంటుందని గుర్తించలేదు. అదీగాక భర్త వచ్చి నిలబడివున్నప్పుడు, తను నవలాపఠనసాగిస్తూ మంచంమీద పరుండరాదనే విషయం, తల్లిదగ్గర నేర్చుకొని వుండలేదు.

ఒకనాడు “అన్నం ఎందుకు వండలేదు?” అని అడిగిన మాధవుడికి, ఆవిడ సూటిగా “నాకు ఆకలికావటంలేదుగనుక” అనిచెప్పింది. ఈ సమాధానంలో ఎంత నిర్భయం, నిర్లక్ష్యం, అవివేకం వుందో మాధవుడు గ్రహించకపోలేదు. అయినా అతను ఎన్నెన్నో విషయాల్లో ఓరిమి వహిస్తూనే వుండబట్టి యిదికూడా వాటిల్లోనే జమచేసుకున్నాడు.

ఒకసారి మాధవుడు క్యాంపునుంచి ప్యూనును వెంటబెట్టుకొని యింటికివచ్చేసరికి తలుపుతాళం వేసివుంది. ప్రక్కయింటివాళ్ళను కనుక్కుంటే ఎదురింటిదంపతులతో సినిమాకు వెళ్ళిందనీ తాళంచెవి వారికి యివ్వలేదనీ తెలియపర్చారు.

ఈ సంఘటన మాధవుడు యింతవరకూ నిలబెట్టుకుంటూ వచ్చిన సహనాన్ని ఛేదించివేసింది. పైగా తనకు యింట్లోవున్న గౌరవం ప్యూను సమక్షాన వెల్లడికావటంతో తలకొట్టివేసినట్లయింది. ఆరాత్రి అతను ఆఫీసులోనే పడుకుని మరునాడు యింటికివచ్చి గంభీరస్వరంతో.

“రాత్రి ఎక్కడికి వెళ్ళావు?” అన్నాడు భార్యను.

“ఏమిటా చించుకోవటం–ఎక్కడికో వెళ్లాను ఏం?” అంది.

మాధవుడు కోపంపట్టలేక అప్రక్కనేవున్న త్రాడు తీసుకొని చెప్టూ లెక్కవేశాడు.

యీ విపరీతఅధికారం మాధవుడికి ఎలా లభ్యపడిందో ఆవిడకు అర్థంకాలేదు. ఆసాయంత్రం బండికే పెట్టే బేడా సర్దుకుని పుట్టింటికి పయనమైంది.

ఆకస్మికంగా వచ్చిన కూతురును చూసి ఆ దంపతులు ఆశ్చర్యపోయారు. జరిగినదంతా విని మాధవుణ్ణి భూమ్యాకాశాలు ఏకమయ్యేట్టు నానాదులుపుదులిపి దుమ్మెత్తిపోశారు.

ఎంతకాలానికీ మాధవుడు వచ్చి భార్యను తీసుకుపోవటంగాని కనీసం ఓవుత్తరంముక్క కూడా వ్రాయకపోవటంతో రాధాకృష్ణయ్య బెదిరింపుతోనూ, కోపగింపుతోనూ అల్లుడికి లేఖలవర్షం కురిపించాడు. అయినా అతడు మాట్లాడలేదు.

కాలం జరిగిపోతోంది. రాధాకృష్ణయ్య తన వ్యక్తిత్వమంతా చంపుకుని జాలిగొలిపేలా అల్లుడికి లేఖవ్రాశాడు. “నిన్ను యింతవాణ్ణి చేసినందుకు నువ్వు యిలా చేయటం ధర్మం కాదు. చిన్నతనంవల్ల అది ఏమైనా కొద్దిపాటి తప్పులు చేసివుండొచ్చు. సంసారమన్నాక యిలాంటిబాధలు వుండకుండాపోవు” అంటూ ఏమేమిటో వ్రాసి వుత్తరం పోస్టుచేసివచ్చాడు.

యింటికివచ్చి మంచినీరు త్రాగి. కుర్చీలో కూర్చున్నాడో లేదో–పోస్టుమన్ వచ్చి శుభలేఖ అందించాడు.

స్వస్తిశ్రీ చాంద్రమాన......వరుడు ......

ఆపైన చదవలేక క్రిందపడేసి లోపలవున్న భార్యను పిలిచి “ఇంకేముంది! ఆమాధవ అనుకున్నంతా చేశాడు” అని శుభలేఖ కాలితో ముందుకు నెట్టాడు.